

చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.



నేత్రపర్వం.. రథోత్సవం

పెన్నహోబిళం లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం కనులపండువగా సాగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం

40.8°/23.9°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం, ఉక్కబోత బాగా పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

చిన్నారిని మింగిన బావి



మృతి చెందిన లాస్య

కంబదూరు: బావిలో పడి చిన్నారి మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కురుబ మారుతి, లక్ష్మి దంపతుల కుమార్తె లాస్య (5) బుధవారం ఉదయం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లింది. ఈ క్రమంలోనే మరో చిన్నారి పావనితో కలిసి ఆడుకుంటూ సమీపంలోని బావి వద్దకు వెళ్లిన లాస్య కాలు జారి అందులో పడిపోయింది. విషయాన్ని పావని పరుగున వెళ్లి తల్లిదండ్రులకు తెలియజేసింది. లాస్య తల్లిదండ్రులు వెళ్లి చూడగా అప్పటికే చిన్నారి నీటిలో మునిగి విగతజీవిగా కనిపించింది. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

వైఎస్సార్ సీపీ నాయకులపై కేసు కొట్టివేత

రాప్తాడు: టీడీపీ హయాంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై బనాయించిన కేసును అనంతపురం అడిషినల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు కొట్టివేసింది. వివరాలు.. 2015 ఏప్రిల్ 29న రాప్తాడు పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు భూమిరెడ్డి శివప్రసాద్ రెడ్డిని టీడీపీ నాయకులు అత్యంత కిరాతంగా వేట కొడవళ్లతో హత్య చేశారు. హత్యను ఖండిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు శాంతియుతంగా ఆందోళన నిర్వహించారు. అయితే, కక్షగట్టిన టీడీపీ నాయకులు ఆందోళనకారులు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారంటూ వైఎస్సార్ సీపీకి చెందిన 73 మందిపై కేసు బనాయించారు. మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి, ఎర్రిస్వామి రెడ్డి, కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దండు రామాంజినేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, నాయకులు హంపాపురంపెద్ద కేశవ రెడ్డి, ఆది రెడ్డి, బాలు, జిలాన్, రాముతో పాటు మరో 62 మందిపై కేసు పెట్టారు. ఎనిమిదేళ్లుగా ఈ కేసు కోర్టులో నడిచింది. సాక్ష్యాధారాలు నిరూపణ కాకపోవడంతో బుధవారం అనంతపురం అడిషినల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు (సబ్ కోర్టు) జడ్జి నిర్మలా కేసు కొట్టి వేశారు.

ప్రశాంతంగా పాలిసెట్


- 88.49 శాతం మంది హాజరు



అనంతపురం ఆర్ట్స్ కళాశాల పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

అనంతపురం: డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించిన ఏపీ పాలిసెట్–2023 ప్రశాంతంగా జరిగింది. కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ పరీక్ష నిర్వహించినట్లు సెట్ జిల్లా కో ఆర్డినేటర్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 9174 మంది దరఖాస్తు చేసుకోగా, 8,118 మంది (88.94 శాతం) విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. బాలురు 4,863 (90.03 శాతం), బాలికలు 3,255 (86.27శాతం) హాజరయినట్లు వెల్లడించారు. అనంతపురంలో 13 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 5,188 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. కళ్యాణదుర్గంలో 5 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, 1,384 మంది పరీక్ష రాశారన్నారు. తాడిపత్రిలో 1,712 మందికి గాను 1546 మంది పరీక్ష రాసినట్లు పేర్కొన్నారు.

'ఈ స్టాంపింగ్'కు దరఖాస్తు చేసుకోండి



అనంతపురం టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ స్టాంపింగ్ విధానంలో స్టాంప్‌ల విక్రయాలు చేపట్టేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఆపైన విద్యార్హతలున్న నిరుద్యోగులతో పాటు ప్రస్తుత స్టాంప్ వెండర్లు సైతం ఉమ్మడి జిల్లాలోని 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఏ రోజుకారోజు తేదీల వారీగా, అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా ఈ స్టాంప్ విధానం అమలవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఈ నెల 15 నుంచి అమలు చేస్తున్నామన్నారు. వివరాలకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

రమణీయం.. బ్రహ్మరథోత్సవం



రాయదుర్గంలో అశేష జనవాహిని నడుమ సాగుతున్న శ్రీవారి బ్రహ్మ రథోత్సవం





అలంకరణలో వేంకటేశ్వరుడు, రథోత్సవంలో పాల్గొన్న విప్ కాపు దంపతులు, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు

రాయదుర్గం: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణుడి బ్రహ్మరథోత్సవం బుధవారం రమణీయంగా సాగింది. గోవింద నామ స్మరణతో రాయదుర్గం మార్మోగింది.అన్నమయ్య కీర్తనలు, చెక్కభజన, కోలాటం, బొమ్మల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 11 గంటలకు మడి తేరు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సతీమణి కాపు భారతి, కుమార్తె స్రవంతిరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు అశేష భక్తజనం నడుమ బ్రహ్మరథోత్సవం ప్రారంభమైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం రథంపై అరటి పండ్లు విసురుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇట్టూరి శ్రీనివాసులు, జెడ్పీటీసీ మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపత్కాలంలో అభయం

- పేదల పాలిట పెన్నిధిగా మారిన '108'
- ఏడాదిలోనే లక్ష మందికి పైగా సేవలు
- నిమిషాల్లోనే చేరుకుని, ప్రాణాలు కాపాడుతున్న అంబులెన్సులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 108 వాహనాలు పేదల పాలిట పెన్నిధిగా మారాయి. అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఏ సమయంలో ఫోన్ చేసినా వాహనాలు క్షణాల వ్యవధిలో ఘటనాస్థలానికి చేరుకుంటున్నాయి. పాముకాటు మొదలు గుండెపోటు బాధితుల వరకూ ఎవరు ఫోన్ చేసినా వాలిపోతూ, ఆస్పత్రులకు తీసుకెళ్తున్నాయి. ఒక్క ఏడాదిలోనే 1,04,551 మంది అంబులెన్సు సేవలు పొందారంటే 108 పథకం ఎంతలా ఆపన్నులకు అండగా నిలిచిందో అర్థం చేసుకోవచ్చు.

టీడీపీ హయాంలో నిర్వీర్యం..

దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి మానసపుత్రికగా పేరొందిన 108 సేవలను టీడీపీ హయాంలో నిర్వీర్యం చేశారు. గర్భిణులు పురిటి నొప్పులు వస్తే ఆస్పత్రికి వెళ్లడమే అప్పట్లో గగనంగా ఉండేది. అయితే, గతానికీ నేటికీ పథకం రూపురేఖలే మారిపోయాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మండలానికొక అంబులెన్సు ఏర్పాటు చేశారు. సమాచారం ఇచ్చిన అరగంటలోనే బాధితులు ఆస్పత్రిలో చేరుతున్నారు. గుండెపోటు ఎంత ప్రమాదమో తెలిసిందే. అలాంటి బాధితులు కూడా ఏడాదిలోనే 4,500 మందికి పైగా 108లో వెళ్లి ప్రాణం కాపాడుకున్నారు. రోజుకు సగటున 287 మంది సేవలు పొందుతుండటం సామాన్య విషయం కాదని వైద్యులు చెబుతున్నారు.



- సంతోషంగా బిడ్డను అందుకుంటున్న ఈమె పేరు ప్రియాంక. డి.హీరేహాళ్ మండలం గొడిసెలపల్లి. ప్రియాంకకు ఇటీవల రాత్రి 8 గంటల సమయంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించగా..21 కిలోమీటర్ల దూరంలోని డి.హీరేహాళ్ నుంచి 15 నిమిషాల్లోనే అంబులెన్స్ గ్రామం చేరుకుంది. గర్భిణిని రాయదుర్గం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలోనే కాన్పు జరిగింది. బిడ్డ క్షేమంగా ఉండడంతో ప్రియాంక ఆనందం అంతా ఇంతా కాదు.



- నార్పల మండలం వెంకటంపల్లికి చెందిన గర్భిణి మల్లికకు మూడు నెలల క్రితం ఉన్నట్లుండి పురిటి నొప్పులు వచ్చాయి. రాత్రి 9 గంటలు కావడంతో ఆమె కుటుంబసభ్యులు భయపడిపోయారు. ఆ సమయంలోనే ఎవరో చెబితే 108కి ఫోన్ చేశారు. 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి నిమిషాల వ్యవధిలో 108 వాహనం చేరుకుంది. గర్భిణిని అనంతపురం తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో పండంటి బిడ్డ పుట్టింది. వీరిద్దరికే కాదు.. జిల్లాలో నిత్యం వందల మందికి 108 అంబులెన్స్‌లు ఆపన్నహస్తం అందిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 108 అంబులెన్సుల వివరాలు	
మొత్తం	66
బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	49
అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	15
నియోనేటల్ లైఫ్‌సపోర్ట్	02
ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు	165
పైలెట్లు (డ్రైవర్లు)	165

కేటగిరీ	సేవలు పొందిన వారు
కోవిడ్	211
గర్భిణులు	26,281
ప్రమాద బాధితులు	8,744
శ్వాస కోశ బాధితులు	8,681
కిడ్నీ బాధితులు	12,993
స్పృహ కోల్పోయి	2,377
పాముకాటు బాధితులు	3,673
కడుపునొప్పి బాధితులు	5,901
గుండె సమస్యల వారు	4,577
కిందపడి గాయపడిన వారు	4,542
మూర్ఛవ్యాధి బాధితులు	2,107
జ్వరబాధితులు	6,502
పాముకాటు	2,356
దాడుల్లో గాయపడ్డవారు	1,287
మధుమేహవ్యాధి..	947
ఇతరులు	13,466
మొత్తం	1,04,651

ఫోన్ చేసిన వెంటనే స్పందించారు



ఇంటి ఆవరణంలో నిద్రిస్తుండగా ఈ నెల 7న పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించగా.. 15 నిమిషాల్లోనే అంబులెన్స్ వచ్చింది. రొళ్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం శిరా ఆస్పత్రికి 108లోనే తీసుకువెళ్లారు. సకాలంలో ఆస్పత్రికి చేరుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డా.

– మారన్న, కె.గొల్లహట్టి, రొళ్ల మండలం

గతానికీ ఇప్పటికీ చాలా తేడా



మండలానికొక అంబులెన్సుతో సేవల్లో గణనీయ మార్పు వచ్చింది. వాహనాల సంఖ్య పెరగడం వల్ల వేగంగా ఘటనా స్థలికి సిబ్బంది చేరుకుంటున్నారు. దీంతో బాధితులు గోల్డెన్ అవర్‌లో చికిత్సకు చేరువవుతున్నారు. ప్రమాదం నుంచి బయటపడుతున్నారు. ప్రాణం కాపాడాక వారు తెలిపే కృతజ్ఞతలతో మాకు ఎంతో సంతృప్తి కలుగుతోంది.

– సంజీవరెడ్డి, మేనేజర్, 108 సేవలు

ప్రతి కేసుపై ప్రత్యేక శ్రద్ధ



108 ద్వారా వచ్చే ప్రతి కేసుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఆస్పత్రిలో 24 గంటలూ మెడికల్ ఆఫీసర్లు, వివిధ విభాగాల వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రాణాపాయం నుంచి గట్టెక్కించేందుకు అన్ని సేవలు అందిస్తున్నాం. ఒక్కో షిఫ్టులో ఓపీ 100 వరకు ఉంటుంది. వీటిలో 20 నుంచి 30 శాతం 108 ద్వారా ఆస్పత్రికి వచ్చే కేసులే.

– డాక్టర్ వైవీ రావు, ఆర్‌ఎంఓ, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

సారా కేసుల నిందితుడిపై పీడీ యాక్ట్



నిందితుడు పాములానాయక్

గుత్తి/అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండాకు చెందిన పాములా నాయక్ అనే వ్యక్తిపై కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు గుత్తి సెబ్ పోలీసులు బుధవారం పీడీ యాక్ట్ ప్రయోగించారు. ఈ విషయంపై ఎస్పీ కె. శ్రీనివాసరావు అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం, మిద్దె తండా గ్రామానికి చెందిన రమావత్ పాములా నాయక్‌పై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి జైలుకు తరలించినట్లు తెలిపారు. నిందితుడిపై గుత్తి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో స్టేషన్‌లో రెండు కేసులు, గుత్తి పోలీసు స్టేషన్‌లో ఒక కేసు నమోదైందన్నారు. సుమారు 198 లీటర్ల నాటు సారాతో పాటు 2 ద్విచక్ర వాహనాలను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇతను విక్రయించే నాటు సారా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, దీంతో పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపామన్నారు. ఇప్పటికే గుత్తి మండలం జక్కలచెరువు గ్రామానికి చెందిన సారా వ్యాపారులు కంపల అశోక్, చిట్టిపోతుల చౌడప్ప, తాడిపత్రి మండలం బోడాయిపల్లికి చెందిన శంబుగాళ్ల హరికృష్ణ, తాడిపత్రికి చెందిన మేడసారి శివశంకర్, గుంతకల్లుకు చెందిన షేక్ జాఫర్, నంద్యాల జిల్లా అవుకు మండలం కొండమనాయునిపల్లికి చెందిన కోనేటి చంద్రపై కూడా పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు తెలిపారు.

మెడికల్ ఆఫీసర్ల కౌన్సెలింగ్ రేపు

అనంతపురం క్రైం: కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్న మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఈ నెల 12న ఉదయం పదిన్నర గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. జాబితాను https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగుకు రావాలని అభ్యర్థులకు సూచించారు. హాజరుకాని వారి పేర్లు ఎంపిక జాబితా నుంచి తొలగిస్తామని తెలిపారు.

ప్రజలకు మరింత మెరుగైన సేవలు

- జవాబుదారీతనం పెంచేందుకే 'జగనన్నకు చెబుదాం'
- కలెక్టర్ గౌతమి వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ

అనంతపురం అర్బన్: ప్రజలకు మరింతగా మెరుగైన సేవలు అందించేందుకే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఎస్పీ కె.శ్రీనివాసరావుతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు.ప్రజల వద్దకే పాలనలో భాగంగా ఇప్పటికే స్పందన కార్యక్రమం ద్వారా సేవలందిస్తున్నామన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి, పోలీసు, వైద్యారోగ్య శాఖ సంబంధిత సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వాటిల్లో 98 శాతం పరిష్కారం అవుతున్నాయని, ఇదే క్రమంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి 100 శాతం సంతృప్త స్థాయిలో సమస్యలు పరిష్కరించడమే ''జగనన్నకు చెబుదాం'' ప్రధాన లక్ష్యమన్నారు. టోల్ ఫ్రీ 1902కు కాల్ చేసి చెబితే సమస్య రిజిస్టర్ అవుతుందని, ఆ గ్రీవెన్స్ నేరుగా సీఎం చూసినట్లేనన్నారు. గతంలో ఇలాంటి ప్రయత్నం ఎన్నడూ జరగలేదన్నారు. పరిష్కారం ఏ స్థాయిలో ఉందనే విషయం కూడా తెలుసుకోవచ్చన్నారు. వెబ్‌సైట్‌లు www.jkc.ap.gov.in, https://www.facebook.com/CaJKC1902, httpr://www.instagram.com/CaJKC1902,https://twitter.com/CaJKC1902 ద్వారానూ సమస్య తెలియజేవచ్చన్నారు. పరిష్కారం అయిన తరువాత ఐవీఆర్‌ఎస్ (సీఎం వాయిస్) ద్వారా తెలియజేస్తారన్నారు. సమస్యలు పరిష్కరిస్తున్నారా, లేదా? అనే విషయాల పరిశీలనకు జెడ్పీ సీఈఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో జిల్లా ఆడిట్ టీమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. జిల్లా, డివిజన్, మండలస్థాయిలోనూ మానిటరింగ్ యూనిట్‌లు పనిచేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు.

సచివాలయాలతో బాల్య వివాహాలకు అడ్డుకట్ట

అనంతపురం సెంట్రల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడుతోందని జిల్లా కలెక్టర్ గౌతమి తెలిపారు. బుధవారం టీవీ టవర్ సమీపంలోని ఎకాలజీ సెంటర్‌లో బాల్య వివాహాల నిర్మూలన కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళా పోలీసుల గ్రామాల్లో ఏం జరిగినా వెంటనే అధికారులకు తెలియజేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు సమన్వయంతో పనిచేస్తే సమర్థవంతంగా బాల్యవివాహాలు అడ్డుకోవచ్చన్నారు. అనేక సామాజిక రుగ్మతలు కాలగర్భంలో కలిసిపోయాయని, వాటి స్థానంలో బాల్య వివాహాలు కూడా చేరే సమయం ఆసన్నమైందని తెలిపారు. డీఆర్డీఏ, విద్య, ఆరోగ్యశాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేంద్రుడు, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, యూనిసెఫ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళీకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, జెడ్పీ సీఈఓ భాస్కర్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యమూ కొనుగోలు

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

బుక్కరాయసముద్రం: వర్షంలో ధాన్యం తడిసినా, మొలకెత్తినా కొనుగోలు చేస్తామని జేసీ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రేగడి కొత్తూరు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మొక్కజొన్న క్వింటా రూ. 1,962 మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు. ఈనెల 12లోగా రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. తేమ 14 శాతంలోపు, రంగు మారిన ధాన్యం 4.5 శాతం లోపు ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శించరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

అనంతపురం అగ్రికల్చర్: వేరుశనగ నాణ్యత విషయంలో రాజీ పడరాదని జేసీ కేతన్‌గార్గ్ ఆదేశించారు. డీఏఓ బి.చంద్రానాయక్, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ జే.ధనలక్ష్మితో కలిసి బుధవారం నగర శివారులో ఉన్న ఆగ్రో సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఆయన సందర్శించారు. విత్తనశుద్ధిని పరిశీలించారు. బస్తాలు తూకం వేసి అవుటన్ చూశారు. రైతులు బాగాలేదని వెనక్కి పంపితే సంబంధిత పర్యవేక్షణ అధికారి అందుకు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎం.వెంకటరాముడు, ఏఓ పి.వెంకటేశ్వరప్రసాద్ తదితరులున్నారు.

నేటి నుంచి వరిధాన్యం కొనుగోలు

- సివిల్ సప్లయిస్ డీఎం నీలమయ్య



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీఎం నీలమయ్య

కణేకల్లు: వరిధాన్యం కొనుగోళ్లు గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సివిల్ సప్లయీస్ డీఎం నీలమయ్య పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కణేకల్లులో 4 ఆర్బీకేలు, 43 ఉడేగోళం, బ్రహ్మసముద్రం, బెణికల్లు, గెనిగెర, యర్రగుంట–1,2, మాల్యం, కళేకుర్తి ఆర్బీకేల పరిధిలో రైతులు పండించిన వరిధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. ఎంపీఈఓలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఆర్బీకేల్లో అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. ఏ– గ్రేడ్ రూ.2,060, సాధారణ రకం రూ.2,040తో కొనుగోలు చేయాలని సూచించారు. గోనె సంచులను రైతులు ఏర్పాటు చేసుకోవాలని, అందుకు అదనంగా డబ్బులిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజాక్‌వలీ, ఏఓ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పరామర్శ

గుమ్మఘట్ట: వాంతులు, విరేచనాలతో రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను రోగులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి బుధవారం పరామర్శించారు. మండలంలోని బేలోడు గ్రామంలో ఫుడ్‌పాయిజన్ కారణంగా మంగళవారం 13 మంది అస్వస్థతకు గురై చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌ఓ బుధవారం రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి చేరుకుని ఘటనపై స్థానిక వైద్యాధికారులు డాక్టర్ జ్ఞాన సుధా, ఉమామహేశ్వర్‌తో ఆరా తీశారు. బేలోడులో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ప్రతి రోగినీ డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. కాగా, బుధవారం ఉదయం బేలోడుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర చేరుకుని ఫుడ్ శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు.

వ్యక్తిపై ఎలుగుబంటి దాడి

రాయదుర్గం టౌన్: స్థానిక పట్టణ పరిధిలోని పైతోట సమీపంలో ఓ రైతు సాగు చేస్తున్న మామిడి తోటకు కాపలా కాస్తున్న శివలింగపై ఎలుగుబంటి దాడి చేసింది. మంగళవారం అర్ధరాత్రి మామిడి చెట్ల వద్ద అలజడి కావడంతో కర్ర తీసుకుని అటుగా వెళ్లిన శివలింగపై ఒక్కసారిగా ఎలుగుబంటి మీదకు దూకింది. గట్టిగా కేకలు వేస్తూ కర్రతో ఎలుగు బంటి దాడిని ప్రతిఘటించాడు. ఘటనలో శివలింగ తలకు తీవ్ర రక్తగాయమైంది. కుడి కన్ను దెబ్బతినింది. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

బంగారం పేరుతో మోసం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మేలిమి బంగారం పేరుతో నకిలీ సరుకు అంటగట్టి రూ.లక్షలతో ఉడాయిస్తున్న ముఠా సభ్యులను స్థానికులు వెంటాడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని 6వ రోడ్డు సమీపంలో మెడికల్ స్టోర్ నిర్వహిస్తున్న బాషాకు ఆగంతకులు ఫోన్ చేసి తమ వద్ద మేలిమి బంగారం ఉందని, తక్కువ ధరకే అందజేస్తామని తెలిపారు. వారి మాటలు నమ్మిన బాషా.. తన మెడికల్ స్టోర్ వద్దకే వస్తే నగదు ఇచ్చి బంగారం తీసుకుంటానని తెలిపాడు. దీంతో రెండు రోజుల క్రితం దుండగులు బాషాను కలసి పరిశీలించుకోవాలని కొన్ని పూసలు చేతికిచ్చారు. అవి మేలిమి బంగారం కావడంతో రూ. 5లక్షలు ఇచ్చి మిగిలిన పూసలు తీసుకున్నాడు. అనంతరం దుండగులు అక్కడి నుంచి జారుకుంటుండగా... అనుమానం వచ్చిన బాషా... తనకు బంగారం వద్దని డబ్బు వాపసు ఇవ్వాలన్నాడు. అతని మాటలు పట్టించుకోకుండా వారు అక్కడి నుంచి ఉడాయించడంతో వెంటనే స్థానికులను బాషా అప్రమత్తం చేసి, వెంబడించారు. అక్కడికి సమీపంలోని ఓ మార్ట్‌లో దూరిన దుండగులను స్థానికులు గుర్తించి, పట్టుకుని నాల్గో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రూ.5 లక్షలతోపాటు, రెండు కిలోల బరువున్న నకిలీ బంగారు పూసలను స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం మంగళవారం నిందితులను అరెస్ట్ చూపి, రిమాండ్‌కు తరలించారు. కాగా, పట్టుబడిన దుండగులను గుజరాత్‌లోని అహమ్మదాబాద్ బస్తీ ఠక్కర్ నగర్‌కు చెందిన వీర నారాయణ, మధ్యప్రదేశ్‌లోని బోపాల్ జిల్లా, గాంధీనగర్ నివాసి సూరజ్‌కుంభాల్ ప్రజాపతిగా పోలీసులు గుర్తించారు.

నేత్రపర్వం.. శ్రీవారి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు


రథం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం విశేష పూజల అనంతరం ఆలయ తూర్పు ద్వారం వద్ద మడుగుతేరును భక్తులు లాగారు. సాయంత్రం బ్రహ్మ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారసింహుడి ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి భక్తుల గోవింద నామస్మరణ మధ్య లాగారు. పూజల్లో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, ఎస్పీ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లానుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు ఎలాంటి అసౌకర్యాలు గురికాకుండా ఆలయ ఈఓ కె. విజయ్ కుమార్, ప్రధాన అర్చకుడు ద్వారకానాథాచార్యులు చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ లింగన్న, ఆలయ పాలక మండలి మాజీ చైర్మన్ అశోక్, ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు లలితమ్మ, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

వంద శాతం ఫీజు వసూళ్లే లక్ష్యం

- మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజినేయులు


మార్కెట్ యార్డు సెక్రటరీలతో సమావేశమైన ఆర్జేడీ రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన విధంగా ఫీజు వసూళ్లు వందశాతం సాధించితీరాలని మార్కెటింగ్ యార్డు కార్యదర్శులను ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు ఆదేశించారు. ఫీజు వసూళ్లపై స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడీఎం పి.సత్యనారాయణ చౌదరితో కలిసి 17 మార్కెట్‌యార్డుల సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో బుధవారం ఆయన సమీక్షించారు. గతేడాది ఓవరాల్‌గా 100 శాతం లక్ష్యం చేరుకున్నా... నిర్దేశిత ఫీజు వసూళ్లలో కొన్ని కమిటీలు వెనుకంజలో ఉన్నట్లు గుర్తు చేశారు. ఈ సారి అలా కాకుండా అన్ని కమిటీలు లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. అనంతపురం జిల్లా పరిధిలో ఉన్న 9 కమిటీల లక్ష్యం రూ.10.81 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని 8 కమిటీలకు రూ.4.92 కోట్ల వసూళ్ల లక్ష్యం నిర్దేశించినట్లు గుర్తు చేశారు. ఏప్రిల్‌తో ముగిసిన మొదటి నెలలో అనంతపురం జిల్లాలో రూ.1.51 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.40 లక్షల వసూలు జరిగాయన్నారు. లక్ష్యం దిశగా సాగుతున్నా కొన్ని కమిటీల్లో అనుకున్నంత పురోగతి కనిపించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్‌యార్డులు, చెక్‌పోస్టుల్లో విజిలెన్స్ చర్యలు పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆడిటింగ్ శాఖను సంప్రదించి అభ్యంతరాలు పరిష్కరించుకోవాలని సూచించారు. గతేడాది వందశాతం సాధించిన మార్కెట్‌కమిటీల సెక్రటరీలకు ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డును సందర్శించారు. అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులు, చీనీ మార్కెట్, కూరగాయల మార్కెట్ ఓపెన్ షెడ్ నిర్మాణ పనులను పరిశీలించారు.

25న బెస్త విద్యార్థులకు సన్మానం

అనంతపురం: జిల్లా పరిధిలో పదో తరగతిలో ప్రతిభ చాటుకున్న బెస్త కులానికి చెందిన విద్యార్థులను సత్కరించనున్నట్లు బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25న అనంతపురంలోని ఆదర్శనగర్‌లో ఉన్న గంగపుత్ర కమ్యూనిటీ హాల్ వేదికగా ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలని, మరింత సమాచారానికి 99857 85523 (నాగేంద్ర) సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ శాఖ ఎస్ఈతో 'ఫోన్‌ఇన్'

అనంతపురం టౌన్: వినియోగదారులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు ఆ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫోన్‌ఇన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల మధ్య కాలంలో 08554 272943 నంబర్‌కు కాల్ చేస్తే నేరుగా తానే మాట్లాడి విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నర్శింగప్ప

గుంతకల్లు: జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించేందుకు ద్విచక్ర వాహనాలను అపహరించుకెళుతున్న ఓ వ్యక్తిని గుంతకల్లు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కసాపురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ నర్శింగప్ప వెల్లడించారు. బుధవారం ఉదయం కసాపురం ఆలయ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని గస్తీలో ఉన్న ఎస్ఐ గోపాలుడు విచారణ చేశాడు. పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో స్టేషన్‌కు తీసుకెళ్లి తమదైన శైలిలో ఆరా తీయడంతో ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడుకు చెందిన వడ్డే గంగరాజుగా గుర్తించారు. గుత్తి, గుంతకల్లు, పామిడి, తాడిపత్రి, కదిరి, కసాపురం ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలను అపహరించుకెళ్లి, తక్కువ ధరకు విక్రయించి జల్సా చేసేవాడు. గతంలో అనంతపురం టూటౌన్ పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించాడు. నిందితుడి నుంచి రూ.8 లక్షలు విలువ చేసే 16 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుడి అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్ఐ గోపాలుడు, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశులు, రామకృష్ణ, సుంకన్న, కానిస్టేబుళ్లు భూపతిరాజు, హరిప్రసాద్, నాగరాజును ఈ సందర్భంగా డీఎస్పీ అభినందించారు.

వేధింపుల కేసులో ఐదేళ్ల జైలు

అనంతపురం: అదనపు కట్నం కోసం వివాహితను వేధించిన కేసులో ముద్దాయిలకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా నాల్గో అదనపు జడ్జి శోభారాణి బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు... అనంతపురంలోని విజయనగర కాలనీకి చెందిన సగినాల నూర్జహాన్ బేగానికి పెనుకొండలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో పనిచేస్తున్న డి.బాబుతో వివాహమైంది. పెళ్లి అనంతరం అదనపు కట్నం కోసం భర్తతోపాటు అత్త మల్లిక, ఆడపడచు నసీమాభాను తరచూ నూర్జహాన్‌ను వేధించేవారు. ఈ క్రమంలోనే ఆమెపై హత్యాయత్నానికి పాల్పడడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు 2012, ఫిబ్రవరి 13న పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు బాబు, మల్లికకి ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.19వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున వాదనలను ప్రత్యేక ప్రాసిక్యూటర్ సుజన వినిపించారు.

పనులు మొదలుపెట్టకపోతే రద్దు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: 'అన్ని ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం. దీనిని దృష్టిలో ఉంచుకుని 15వ ఆర్థిక సంఘం నిధులతో సమగ్రాభివృద్ధి సాధించాలని 58 మండలాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు రూ.8.16 కోట్లతో 185 పనులు మంజూరు చేశాం. ఈ పనులన్నీ గడువులోపు పూర్తి కావాల్సిందే'నని ఉమ్మడి జిల్లా అధికారులను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, పనుల కేటాయింపుపై అనంతపురం జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో బుధవారం ఆమె సమీక్షించారు. పీఆర్ ఎస్ఈలు భాగ్యరాజ్, గోపాలరెడ్డి, రెండు జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు హాజరయ్యారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మండలాల వారీగా మంజూరైన, పూర్తయిన, పురోగతిలో ఉన్న పనులపై ఆరా తీశారు. ఇప్పటి వరకూ 50 శాతం పనులు పూర్తి కాగా, వాటికి సంబంధించిన బిల్లులు కూడా మంజూరు చేశామన్నారు. మిగిలిన 50 శాతం పనులు వేగవంతం చేయాలన్నారు. లేకపోతే వాటిని రద్దు చేసి, ఇతర మండలాలకు నిధులు మళ్లించాలని ఆదేశించారు. నిధులు, నీళ్లు, నియామకాల విషయంలో అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేస్తున్నామని స్పష్టం చేశారు.

శభాష్.. భాస్కరరెడ్డి : శింగనమల సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డిని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అభినందించారు. నియోజకవర్గానికి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయడంతో పాటు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణాల్లో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచారని కొనియాడారు. ప్రత్యేక డిజైన్లను రూపొందించి, గడువుకు ముందే పనులు పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ఇతర మండలాల ఇంజినీరింగ్ అధికారులు కూడా పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ ఎండీ అమృతరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు జవహర్ కుమార్(అనంతపురం), రషీద్ ఖాన్(శ్రీసత్యసాయి జిల్లా) పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో టెక్కీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సైబర్ నేరగాళ్ల వలలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ (టెక్కీ) చిక్కుకుని రూ.5 లక్షలు చేజేతులా అప్పగించి, చివరకు పోలీసులను ఆశ్రయించింది. అనంతపురం వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి తెలిపిన మేరకు.. స్థానిక శారదానగర్‌లో నివాసముంటున్న రిషిత బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల సెలవుపై వచ్చిన ఆమెకు సోమవారం రాత్రి ఓ వ్యక్తి ఫోన్‌చేసి 'మీ ఖాతాలోని రూ.45 లక్షలు వేరే ఖాతాల్లోకి జమ అయిందని, వాటిని తిరిగి మీ ఖాతాలోకి మళ్లించాలంటే రూ.5 లక్షలు తక్షణం తాను సూచించిన ఖాతాకు బదిలీ చేయాలని సూచించాడు. ఆ మాటల గారడీలో చిక్కుకున్న రిషిత వెంటనే నగదు బదిలీ చేసింది. అనంతరం తన ఖాతాను పరిశీలించుకున్న ఆమె తాను మోసపోయినట్లు గుర్తించి వెంటనే ఆగంతకుడి ఫోన్ నంబర్‌కు కాల్ చేసింది. అప్పటికే ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తపాలా ఉద్యోగుల సొసైటీ అధ్యక్షుడిగా పీఎస్ఆర్‌కే ప్రసాద్

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా ఉద్యోగుల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు బుధవారం నిర్వహించిన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మేరకు ఎన్నికల అధికారి ఎస్.కుమార్ ప్రకటించారు. అధ్యక్షుడిగా పీఎస్ఆర్‌కే ప్రసాద్(పోస్టల్ అసిస్టెంట్-అనంతపురం హెడ్ పోస్టాఫీస్), ఉపాధ్యక్షుడిగా బి.నరేంద్రనాథ్‌రెడ్డి(మెయిల్ ఓవర్ సీర్-గుంతకల్లు), కార్యదర్శిగా బి.హర్షవర్ధన్‌రెడ్డి(పోస్టల్ అసిస్టెంట్-అనంతపురం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాల ప్రారంభం


గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం


విశేష అలంకరణలో మూలవిరాట్


తులసి లక్షార్చనలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో దక్షిణాది హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే మూలవిరాట్‌కు అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. అనంతరం యాగశాలలో మధ్యాహ్నం 12.30 గంటల వరకు వివిధ పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి తులసి లక్షార్చన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రాకారోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డి.వెంకటేశ్వర్లు, ఏఈఓ ధనుంజయ, ఆలయ ధర్మకర్త సుగణమ్మ, ప్రధాన అర్చకుడు గరుడ స్వామి, ఆలయ పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో ఎంపీ రంగయ్య


ఇతర రాష్ట్రాల ఎంపీలతో కలసి పర్యటిస్తున్న ఎంపీ రంగయ్య

అనంతపురం క్రైం: జాతీయ ఉపాధి హామీ పథకం పనుల పరిశీలనపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉపాధి పనులను పరిశీలిస్తోంది. కమిటీలో సభ్యుడిగా అనంతపురం ఎంపీ తలారి రంగయ్య కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో కమిటీ సభ్యులతో కలసి హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో బుధవారం ఆయన పర్యటించారు. ఉపాధి పనులను పరిశీలించారు.

ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించండి : డీఐజీ


ట్రాఫిక్ పరిశీలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. బుధవారం ఉదయం టవర్ క్లాక్ నుంచి సుభాష్ రోడ్డు మీదుగా సప్తగిరి సర్కిల్ వరకూ ఆయన నడుచుకుంటూ వెళ్లి ట్రాఫిక్ రద్దీని పరిశీలించారు. దుకాణాల ఎదుట రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉండటాన్ని గమనించి, దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించి, వాహనాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎస్ఐలు వంశీకృష్ణ, శ్రీనివాసులు, భాస్కరరావు ఉన్నారు.

బీటెక్ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) బీటెక్ నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్ (ఆర్-19), సప్లిమెంటరీ (ఆర్-15) పరీక్ష ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ పరీక్షలకు 14,508 మంది విద్యార్థులు హాజరుకాగా..13,317 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలకు సంబంధించి రీకౌంటింగ్ ఫొటో కాపీ, చాలెంజ్ వాల్యుయేషన్ నోటిఫికేషన్ జారీ చేస్తున్నామని, గురువారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని వైస్ చాన్స్‌లర్ సూచించారు. అలాగే ఈ నెల 25 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను కూడా ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ తదితరులున్నారు.

బాల్య వివాహం అడ్డగింత

కళ్యాణదుర్గం: స్థానిక కోటవీధిలో బుధవారం జరుగుతున్న ఓ బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. తమ 16 ఏళ్ల కుమార్తె (9వ తరగతి పూర్తి)కు తల్లిదండ్రులు పెళ్లి చేస్తున్నట్లుగా 1098కు సమాచారం అందడంతో అప్రమత్తమైన కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్ఐ కృష్ణ, సిబ్బంది వెంటనే ఆ బాలిక కుటుంబసభ్యులను కలసి మాట్లాడారు. తల్లిదండ్రులతో పాటు బాలికకూ బాల్య వివాహాల కలిగే అనర్థాలు, బాల్య వివాహాల నిషేధిత చట్టంపై అవగాహన కల్పించారు. బాలిక మేజర్ అయ్యే వరకూ వివాహం చేయకూడదని హెచ్చరించారు.

జాగ్రత్తగా పరిశీలించండి

రాప్తాడురూరల్: పదో తరగతి రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ సమయంలో విద్యార్థుల జవాబు పత్రాలను ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా పరిశీలించాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్లతో ఆయన వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి చదువుకున్న ఒక్క విద్యార్థి కూడా మార్కుల విషయంలో నష్టపోకూడదన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత విద్యార్థి జవాబుపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మార్కులను లెక్కించాలన్నారు.

13లోపు వచ్చిన దరఖాస్తులే పరిగణనలోకి.. : రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం సీఎఫ్ఎంఎస్ సిటిజన్ చలానాలో మాత్రమే ఈనెల 13 లోపు చెల్లించి దరఖాస్తులను అనంతపురంలోని కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో అందజేయాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. రీ కౌంటింగ్‌కు ఒక సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.1,000 చొప్పున చెల్లించాలన్నారు. ఒక విద్యార్థి అన్ని సబ్జెక్టులకు కలిసి ఒకే చలానా తీయవచ్చన్నారు. 13వ తేదీ తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణలోకి తీసుకోమని స్పష్టం చేశారు.

ప్రశ్నపత్రాలు భద్రపరచండి

ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షలకు సంబంధించి పోలీస్ స్టేషన్లలో ఉన్న సెట్-2 ప్రశ్నపత్రాలను అక్కడి నుంచి తరలించాలని ప్రధానోపాధ్యాయులను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం నగరంలోని పోలీస్‌స్టేషన్లలో ఉన్న ప్రశ్నపత్రాలను కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో అప్పగించడంతో పాటు మిగిలిన ప్రాంతాల్లోని ప్రశ్నపత్రాలను ఆయా పాఠశాలల్లోనే ఉంచుకోవాలని సూచించారు. మిగులు జవాబు పత్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరత్రా వాటికి ఉపయోగించరాదన్నారు. రాజముద్ర ఉన్న జవాబుపత్రాలను ఇతర వాటికి ఉపయోగించినా, చిత్తుకాగితాల్లో పడేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఒక జవాబు పత్రం మిగులుగా ఉన్న వెంటనే కేఎస్ఆర్ బాలికల పాఠశాలకు వచ్చి అందజేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

వేసవి శిబిరాలతో విజ్ఞానం



విద్యార్థులు తయారు చేసిన బొమ్మలు

రాప్తాడు: వేసవి శిక్షణ శిబిరాల వల్ల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయాధికారి వీరనారాయణ రెడ్డి అన్నారు. వేసవి శిబిరంలో భాగంగా బుధవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు చెప్పించారు. అనంతరం చిత్ర లేఖనంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పేపర్లతో తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు బుల్లే నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: మండల సర్వసభ్య సమావేశం గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ్ ప్రసాద్, ఎంపీపీ సుబ్బార హేమలత తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులంతా తప్పక హాజరుకావాలన్నారు. గత సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలు, తీసుకున్న చర్యలపై సమగ్ర వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. గురువారం నాటి సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

సునీల్‌కుమార్‌కు పీహెచ్‌డీ



డాక్టర్ సునీల్‌కుమార్

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగంలో ట్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సునీల్‌కుమార్‌కు చెన్నైలోని సవిత యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. సవిత డెంటల్ కళాశాల మైక్రో బయాలజీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ షైలీన్ గిరిజ ఆధ్వర్యంలో ఆయన పరిశోధన చేశారు. డాక్టరేట్ పొందడం పట్ల సునీల్‌కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు, విద్యార్థులకు మరిన్ని మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

రాప్తాడు: బాల్య వివాహాలు అనర్థాలకు దారి తీస్తున్నాయని ఎస్‌ఐ పి.వై.ఆంజనేయులు అన్నారు. బుధవారం రాప్తాడులో డ్రామా కట్ట దగ్గర ఆర్డీటీ కళా బృందం సభ్యులు చిన్న వయసులో ఆడ పిల్లలకు పెళ్లిళ్లు చేయవద్దని పాటల ద్వారా అవగాహన కల్పించారు. 'బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు' అని నినదించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌ఐ మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరమన్నారు. ఎక్కడైనా బాలల హక్కులకు భంగం వాటిల్లితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. 18 ఏళ్లలోపు వారిని పనుల్లో పెట్టుకుంటే బాలకార్మిక చట్టం ప్రకారం శిక్షార్హులవుతారన్నారు. కార్యక్రమంలో ఏటీఎల్ మల్లికార్జున, సీఓ సరోజ, కళా బృందం టీం లీడర్ శ్యాంసన్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా రామస్వామి

అనంతపురం క్రైం: పల్మనాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రామస్వామి సర్వజనాస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా రెండు రోజుల పాటు విధులు నిర్వర్తించనున్నారు. పరిపాలనపై పట్టు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ వెళ్లడంతో రామస్వామి ఆ బాధ్యతలు తీసుకున్నారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి



విద్యార్థులకు శిక్షణ అందిస్తున్న దృశ్యం

కనగానపల్లి: విద్యార్థులు చదువుతో పాటు డ్రాయింగ్, చెస్ తదితర పోటీల్లో పాల్గొంటూ సృజనాత్మకతను పెంపొందించుకోవాలని గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు డ్రాయింగ్, చెస్, క్యారమ్స్, యోగా తదితర వాటిల్లో మెలకువలు నేర్పారు.

బంగారు నగల అపహరణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలోని మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ మార్ట్ సమీపంలో ఉన్న ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. విశాల్ మార్ట్ సమీపంలో నివాసముంటున్న వరలక్ష్మి.. కాయగూరల వ్యాపారంతో జీవనం సాగిస్తోంది. బుధవారం ఉదయం వృద్ధుడైన తండ్రిని ఇంటి వద్ద ఉంచి దుకాణానికి వెళ్లింది. ఆ సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువా తెరిచి ఆరు తులాల బంగారు నగలు చేజిక్కించుకున్నారు. అదే సమయంలో అడ్డుకునే ప్రయత్నం చేసిన వృద్ధుడిని పక్కకు నెట్టేసి ఉడాయించారు. విషయం తెలుసుకున్న వరలక్ష్మి... ఇంటికి చేరుకుని ఘటనపై తండ్రిని ఆరా తీశారు. అనంతరం ఫిర్యాదు చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



తోటలో కనకాంబరాలు తొలగిస్తున్న మహిళా కూలీలు



కనకాంబరం తోటలో అంతర పంటగా సాగుచేసిన మునగ

ఉద్యాన వికాసం

జిల్లాలో ఉద్యాన పంటలు పెద్ద ఎత్తున సాగవుతున్నాయి. పండ్లు, పూలతోటలను రైతులు విస్తారంగా సాగు చేస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. ఈ పంటల సాగులోనూ ఆధునిక, వినూత్న పద్ధతులు అవలంబిస్తున్నారు. అనంతపురం రూరల్ మండలం పూలకుంట, చియ్యేడు, మన్నీల తదితర ప్రాంతాల్లో కనకాంబరాలు ఎక్కువగా పండిస్తున్నారు. ప్రస్తుతం కిలో రూ.350 వరకు ధర పలుకుతున్నాయి. ఈ పూలు హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. అలాగే ఇటుకలపల్లి పరిసరాల్లో బొప్పాయి తోటలు సాగులో ఉన్నాయి. రైతులు వినూత్న పద్ధతుల్లో మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఇటుకలపల్లి వద్ద రైతు మహేష్ తోటలో బొప్పాయిని చీరలతో సంరక్షిస్తున్న దృశ్యం

మూడు చక్రాల వాహనాలకు రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వాహనాలు

అనంతపురం సెంట్రల్: వికలాంగ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ద్వారా అందించిన 80 మూడు చక్రాల వాహనాలకు రిజిస్ట్రేషన్ చేశారు. బుధవారం ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన వాహనాలను మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి ప్రత్యేకంగా పరిశీలించి రిజిస్ట్రేషన్ చేశారు. ప్రభుత్వం అందించిన ఈ వాహనాలు విభిన్న ప్రతిభావంతులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని తెలిపారు.

వైవీయూ వీసీగా సుధాకర్

అనంతపురం: యోగివేమన వర్సిటీ (వైవీయూ) వైస్ చాన్స్‌లర్‌గా ఎస్కేయూ బోటనీ మాజీ ప్రొఫెసర్, బీఎస్ఆర్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు చాన్స్‌లర్/ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్కేయూలో 1987లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చింతా సుధాకర్ కెరీర్ ప్రారంభించారు. 34 సంవత్సరాల పాటు బోధనానుభవం, 37 సంవత్సరాల పరిశోధనానుభవం ఉంది. రూ.4.5 కోట్లతో యూజీసీ రీసెర్చ్ ప్రాజెక్ట్ నిర్వహించారు. 30 మంది ఆయన పర్యవేక్షణలో డాక్టరేట్ పొందారు. వీసీగా నియమితులైన సందర్భంగా ప్రొఫెసర్ చింతా సుధాకర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రావణి

రాప్తాడు: ప్రభుత్వాస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవం జరుగుతుందని వైద్యాధికారులు శ్రావణి, శివ కృష్ణ తెలిపారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హై రిస్క్ గర్భిణులకు పరీక్షలు చేసి సలహాలిచ్చారు. అనంతరం వైద్యాధికారులు మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా సురక్షిత ప్రసవం సాధ్యమవుతుందన్నారు. పీఎంఎస్ఎంఏ పథకం ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం, వైద్య పరీక్షల కోసం రెండు విడతలుగా రూ.6 వేలు లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రక్తహీనత అధిగమించేందుకు తీసుకోవాల్సిన ఆహారం, టీకాలు, తల్లి పాల ప్రాధాన్యత, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అరుణమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల్లో నైతిక విలువలు పెంపొందిద్దాం

- చిన్మయామిషన్ ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి

అనంతపురం కల్చరల్: పిల్లల్లో నైతిక విలువలు, దేశభక్తి వంటి ఆదర్శ భావాలను పెంపొందిద్దామని తల్లిదండ్రులకు చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జి స్వామి ఆత్మవిదానంద సరస్వతి పిలుపునిచ్చారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 15 రోజులుగా సాగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు బుధవారం జరిగాయి. స్థానిక మొదటిరోడ్డులోని శారదా పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి స్వామీజీ విశిష్ట అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆటపాటలు మాత్రమే కాకుండా నీతికథలు, దేశభక్తి ప్రబోధిత పోటీలు, యోగా, శతక పద్యపఠనం లాంటి ఉత్తమ శిక్షణను అందించిన రామకృష్ణ సేవా సమితి కృషి అభినందనీయమన్నారు. శిక్షణలో నేర్చుకున్న వాటిని ఇంటి వద్ద సాధన చేయాలని సూచించారు. నిర్వాహకులు గుత్తి శ్రీధర మూర్తి, ప్రముఖ సంస్కృత పండితులు డాక్టర్ నాగత్రిశూలపాణి, డాక్టర్ శశి, తదితరులు నైతిక విలువల ప్రాధాన్యతపై ప్రసంగించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు, ఉత్తమ గ్రంథాలను అందించారు. కార్యక్రమంలో వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు సత్యానందం, చలపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రవీణ్, విశ్రాంత హెచ్‌ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

సర్వే రాళ్లు పక్కాగా నాటాలి



రైతు పొలంలో రీ సర్వే రాళ్లను నాటిస్తున్న తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు

రాప్తాడు: 'వైఎస్సార్ జగనన్న భూ హక్కు, భూ రక్ష' పథకం కింద రీ సర్వే పూర్తి చేసిన బొమ్మేపర్తి గ్రామంలో హద్దు రాళ్లు పక్కాగా నాటాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహులు ఆదేశించారు. తొలి విడతలో రీ సర్వేకు బొమ్మేపర్తి గ్రామం ఎంపిక కాగా, రీ సర్వేను పూర్తి చేసి రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. తాజాగా ఒంగోలు జిల్లా నుంచి 218 సరిహద్దు రాళ్లు వచ్చాయని, వాటిని రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన హద్దుల్లో రోవర్ ద్వారా నాటిస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు గుండె వైద్య శిబిరం

అనంతపురం క్రైం: నగరంలోని 2,3వ సర్కిళ్లలో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని గురువారం ఉదయం పది గంటలకు ఏర్పాటు చేసినట్లు నగర పాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కోర్టు రోడ్డులోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో శిబిరం ఉంటుందని, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'విద్యారంగ కాషాయీకరణ మానుకోవాలి'

రాప్తాడురూరల్: విద్యారంగ కాషాయీకరణను మానుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అనంతపురం తహసీల్దార్ శ్రీధరమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ జిల్లా ఉపాధ్యక్షుడు సులేమాన్ షరీఫ్ మాట్లాడుతూ విద్యావ్యవస్థను కాషాయీకరణ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అన్నారు. దేశ చరిత్రను మార్చే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గమన్నారు. స్వాతంత్ర్యం కోసం బలి అయిన భగత్ సింగ్ చరిత్రను కర్ణాటక బీజేపీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాల నుంచి తొలగించి ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ ప్రసంగాన్ని చేర్చాలనే ప్రయత్నం చేసిందన్నారు. చరిత్రను వక్రీకరించే చర్యలు మానుకోవాలని, లేదంటే విద్యార్థులు, యువకులు, రాజ్యాంగ రక్షకులు, ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, ప్రజలు పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఎంపీజేపీ నాయకులు సిరాజ్, ఫిరోజ్, రహంతుల్లా, ఉమర్, హాజీపీరా తదితరులు ఉన్నారు.

త్వరలోనే ఆర్చ్ పునర్నిర్మాణం

- ముందుగా అనుమతి తీసుకునే తొలగింపు
- గోపా మచ్చానరసింహులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గోపా మచ్చా నరసింహులు

అనంతపురం కల్చరల్: ముందుగా అనుమతి తీసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరమే ఆర్చ్ తొలగించారని, త్వరలో కొత్త ఆర్చ్‌ను సుందరంగా నిర్మిస్తామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపా మచ్చా నరసింహులు తెలిపారు. బుధవారం స్థానిక కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన ఆర్చ్ తొలగింపు విషయంలో అపార్థాలు చోటు చేసుకోవడం, కొన్ని వీడియోలు వైరల్ కావడం విచారకరమన్నారు. మరమ్మతుల తర్వాత అంతే సుందరంగా నిర్మించడానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆర్యవైశ్యులకు భరోసా అందించారన్నారు. చిన్న వాన వచ్చినా గుల్జార్‌పేట పరిసరాలలో మురుగు పొంగి పొర్లుతూ ఆలయంలోకి వచ్చేస్తోందన్నారు. అలాంటి పరిస్థితులను నివారించడానికి అధికారుల దృష్టికి తీసుకెళ్తానే సానుకూలంగా స్పందించారన్నారు. డ్రైనేజీ మరమ్మతుల తర్వాత ఆలయ పరిసరాలు మరింత శుభ్రంగా ఉంచాలని స్వయంగా ఎమ్మెల్యే కోరుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లికార్జున, కమిటీ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, టంగటూరు నాగభూషణం, సతీష్‌గుప్తా, కిషోర్, జయం సురేష్‌కుమార్, రమేష్‌బాబు, కృష్ణం రఘు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు నుంచి రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ శుభకర్

రాప్తాడు: ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసే రైతుల కోసం నెలాఖరు నుంచి రాయితీతో విత్తన పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఏఓ శుభకర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశమై విత్తన పంపిణీపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేరుశనగ విత్తనశుద్ధి (ప్రాసెసింగ్) ఇప్పటికే ప్రారంభించామన్నారు. మే రెండో వారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో విత్తన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తన వేరుశనగపై 40 శాతం రాయితీ ప్రకటించిందని, కే-6 రకం రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద 30 కిలోల బస్తాకు రూ.1,674 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే 1812 రకం విత్తనానికి రాయితీ పోను 30 కిలోల బస్తాకు రూ.1,494 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి రైతుకూ గరిష్టంగా 3 బ్యాగులు పంపిణీ చేస్తామన్నారు.

ఆకట్టుకుంటున్న వేసవి విజ్ఞాన శిబిరం



అంబటి కృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్థులను ఆకట్టుకుంటోంది. అనంతపురంలోని సెంట్రల్ లైబ్రరీకి పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరై.. పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ మాజీ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి దంపతులు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా, మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, కార్యదర్శి పి.రమ తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

అనంతపురం: అత్యున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అంకితభావంతో కృషి చేయాలని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ రెక్టార్ ప్రొఫెసర్ హెచ్ లజిపతిరాయ్ అన్నారు. బుధవారం ఎస్కేయూ కామర్స్ విభాగాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ఇంటర్వ్యూలకు ఎలా సన్నద్ధం అవ్వాలనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.ఆంజనేయులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. మద్దిలేటి పాల్గొన్నారు.

'ది కేరళ స్టోరీ'ని నిషేధించాలి

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్



మాట్లాడుతున్న నదీం అహ్మద్

అనంతపురం టవర్‌క్లాక్: ది కేరళ స్టోరీ సినిమాను నిషేధించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత విద్వేషాలకు ఆజ్యం పోసేలా చిత్రీకరించిన సినిమాను తక్షణమే నిలుపుదల చేయాలన్నారు. దేశంలో అత్యధిక అక్షరాస్యత శాతం కలిగిన కేరళ రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళల గురించి వివాదాస్పదమైన కథనాలతో సినిమా తీశారన్నారు. ఈ విషయంపై కేరళ సీఎం కూడా అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ముస్లింల మత విశ్వాసలపై విషం చిమ్మడం భావ్యం కాదన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం సినిమాను నిషేధించిందన్నారు. లౌకిక విలువల పరిరక్షణకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నాయకులు జాఫర్, దాదా గాంధీ,నల్లప్ప తదితరులున్నారు.

జగనన్న ఆర్థిక భరోసా కల్పించారు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే 'అనంత'తో లబ్ధిదారుల ఆనందం

అనంతపురం క్రైం: అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలతో ఆర్థిక భరోసా లభించిందని, మరోసారి సీఎం జగనన్నే కావాలని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం నగరంలోని 6వ డివిజన్ వేణుగోపాల్‌నగర్‌లో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ సుజాత, సచివాలయ కన్వీనర్లు రమాదేవి, సుబ్బారెడ్డితో కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లారు. ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. అమ్మఒడి, పింఛన్, చేయూత ద్వారా అందిన డబ్బుతో పాటు బార్బర్ దుకాణానికి ఉచిత కరెంటు సౌకర్యం కల్పించారని, ప్రభుత్వం చేసిన మేలును మర్చిపోలేమని రామాంజినేయులు,వెంకటనారాయణమ్మ దంపతులు తెలియజేశారు. సచివాలయ వ్యవస్థతో వ్యయ ప్రయాసాల్లేకుండా వలంటీర్లు, సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. కోవిడ్‌తో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు, ప్రస్తుత ఫీజులతో పిల్లలను చదివించుకోవడం గగనమయ్యేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని అమ్మఒడి, విద్యా, వసతి దీవెన తదితర పథకాల ద్వారా సౌలభ్యాలు కల్పించడంతో తమ బిడ్డను మంచి కళాశాలలో బీటెక్ చేర్పించామని చంద్రలేఖ అనే గృహిణి ఆనందం వ్యక్తం చేసింది. సుధాబాయి అనే మహిళ సైతం చదువుకు ప్రభుత్వం అందిస్తున్న కృషిని మరువలేమని తెలిపింది.

రూ.50 లక్షలతో బీటీ రోడ్డు..

గుత్తి రోడ్డు నుంచి వేణుగోపాల్‌నగర్ త్రివేణి టాకీస్ క్రాసింగ్ వరకూ రూ.50 లక్షలతో బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వర్షం వస్తే రోడ్డు చివర మురుగు నిలుస్తోందని స్థానికులు ఎమ్మెల్యేకి విన్నవించగా, మేయర్ వసీంను పిలిచి, మరో రూ.10 లక్షలతో బీటీ రోడ్డు ఎత్తు పెంచి మురుగు సక్రమంగా వెళ్లేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. కాలువ సమస్య తెలియజేయగా, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కోర్టు కేసుల్లో ఉన్న భూముల్లో పట్టాలు పొందిన వారికి మరో చోట ఇంటి పట్టాలను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్ఓ డాక్టర్ దామోదర్ రెడ్డి, డైరెక్టర్లు గౌస్‌బేగ్, గోవింద్, శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, అనుబంధ సంఘాల అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, కార్పొరేటర్ సైపుల్లా బేగ్, రాజేశ్వరి, జయలలిత, నాయకులు యోగి, సత్రసాల మంజునాథ్, బీసీ శేఖర్, జావెద్, గౌరి, భారతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వేణుగోపాల్ నగర్‌లో..

6వ డివిజన్‌లోని వేణుగోపాల్‌నగర్‌లో గురువారం ఉదయం 6.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. పీవీకేకే కళాశాల సమీపంలో నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

అల్లాహ్ అనుగ్రహంతోనే హజ్ యాత్ర



వేదికపై వక్తలు

అనంతపురం సిటీ: అల్లాహ్ కోరుకున్న వారికి మాత్రమే హజ్ యాత్ర చేసే అవకాశం లభిస్తుందని, లేకపోతే సాధ్యం కాదని వక్తలు స్పష్టం చేశారు. హజ్ యాత్ర చేసే ప్రతి ముస్లిం అల్లాహ్‌కు ప్రీతిపాత్రం కావాలని పిలుపునిచ్చారు. అనంతపురంలోని ఆజాద్ ఫంక్షన్ హాలులో ఏపీ హజ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. హజ్ కమిటీ ప్రతినిధి ముస్తాక్ మౌలానా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మేయర్ మహమ్మద్ వసీం సలీం, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ హిరియల్ నదీమ్ అహమ్మద్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ముస్లింలు పాటించే ఐదు ప్రధాన సూత్రాలలో హజ్జు విధిగా పాటించాల్సి ఉందన్నారు. హజ్ యాత్రకు వెళ్లే వారు మక్కాతో పాటు కాబా సందర్శించడమే ప్రధాన ధ్యేయమన్నారు. హజ్జు నియమ నిష్టలను పాటించడం ద్వారా అత్యంత పవిత్రులుగా మారిపోతారన్నారు. జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాతో పాటు మన రాష్ట్రం గురించి దువా చేయాలని కోరారు. రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మేయర్ వసీం హామీ ఇచ్చారు. విజయవాడ నుంచి వెళ్లే వారికి అదనపు చార్జీలు పడతాయని, ఈ భారాన్ని తగ్గించేందుకు చొరవ చూపాలని కేంద్ర మంత్రులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, హజ్ కమిటీ చైర్మన్ చర్చించినట్లు తెలిపారు. దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.